కొన్న ధాన్యం అదే రోజు రవాణా చేయాలి

- సన్నరకం ధాన్యానికి రూ.500 బోనస్
- కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలి
- కలెక్టర్ రాహుల్‌రాజ్
- ధాన్యం కొనేందుకు యంత్రాంగం సిద్ధం
- కొనుగోలు కేంద్రాల్లో ఆకస్మికంగా తనిఖీ
- అదనపు కలెక్టర్ నగేశ్

నర్సాపూర్, నవంబర్ 5: కొన్న ధాన్యాన్ని అదే రోజు రవాణా చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ ఆదేశించారు. మంగళవారం మండలంలోని ఎర్రకుంట తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించారు. కొనుగోళ్ల తీరును పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సన్న, దొడ్డు రకం విక్రయాలు వేర్వేరుగా చేపట్టాలని నిర్వాహకులకు సూచించారు. సన్నరకం ధాన్యానికి ప్రభుత్వం రూ.500 బోనస్ ఇస్తున్నట్లు తెలిపారు. ట్యాబ్ ఎంట్రీని పకడ్బందీగా చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల్లో కల్పిస్తున్న సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. కలెక్టర్ వెంట ఆర్డీవో మహిపాల్, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.

పీహెచ్‌సీ తనిఖీ

మండలంలోని రెడ్డిపల్లి గ్రామంలో పీహెచ్‌సీని కలెక్టర్ తనిఖీ చేశారు. దవాఖానలోని పలు వార్డులను పరిశీలించి, రోగులతో స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు. విధుల పట్ల నిర్లక్ష్యంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. మెడికల్ ఆఫీసర్స్ రఘువరన్, వైద్య సిబ్బంది ఉన్నారు.

రైతులకు ఇబ్బందుల్లేకుండా చూడాలి

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూసేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉన్నదని అదనపు కలెక్టర్ నగేశ్ తెలిపారు. హవేళీఘనపూర్ మండలం కొత్తపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగేందుకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టామన్నారు. ఏమైనా సమస్యలుంటే అక్కడికక్కడే పరిష్కరించాలని ఆదేశించారు. జిల్లాలో 490 సెంటర్లలో ఇప్పటివరకు 1870 మెట్రిక్ టన్నుల ధాన్యం కొన్నట్లు తెలిపారు. సన్న, దొడ్డు రకం ధాన్యం బస్తాలు విడివిడిగా భద్రపరచాలని, రకాలు గుర్తించడానికి వీలుగా చేరిగిపోకుండా గుర్తులు వేయాలని పేర్కొన్నారు. కొన్న ధాన్యాన్ని ట్యాగింగ్ చేసిన మిల్లులకు రవాణా చేసేందుకు, ఎలాంటి ఇబ్బందులు రాకుండా ఏర్పాట్లు చేయాలన్నారు. ఆయన వెంట హవేళీఘనపూర్ తహసీల్దార్ సింధు రేణుక, డిప్యూటీ తహసీల్దార్ నవీన్, సిబ్బంది ఉన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 5: కొనుగోలు కేంద్రాల్లోనే రైతులు ధాన్యం విక్రయించాలని వ్యవసాయశాఖ సహాయ ఇన్‌చార్జి సంచాలకుడు రాజ్‌నారాయణ అన్నారు. పట్టణంలోని కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. మండల వ్యాప్తంగా 13 సొసైటీల్లో, రెండు ఐకేపీల ద్వారా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించినట్లు తెలిపారు. ఆయనతో విస్తీర్ణ అధికారులు ప్రవీణ్, సీఈవో నర్సింహులు, రైతులు ఉన్నారు.

చిన్నశంకరంపేటలో..

చిన్నశంకరంపేట, నవంబర్ 5: జిల్లా వ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనడం ప్రారంభమైందని సివిల్ సప్లై డీఎం హరికృష్ణ తెలిపారు. మండలంలోని కొర్విపల్లి, కుర్మపల్లి గ్రామాల్లో కొనుగోలు కేంద్రాలను సందర్శించారు.

వెల్దుర్తి మండలంలో..

వెల్దుర్తి, నవంబర్ 5: వెల్దుర్తి, మాసాయిపేట మండలాల్లోని పలు గ్రామాల్లో వెల్దుర్తి సొసైటీ ఆధ్వర్యంలో వెల్దుర్తి మండలంలోని ఏదులపల్లిలో సీఈవో సిద్ధయ్య, డైరెక్టర్ కిష్టాగౌడ్, నాయకులు దుర్గాగౌడ్, భూమయ్య, ఇంద్రారెడ్డితో కలిసి ప్రారంభించారు. మాసాయిపేట మండలంలోని హకీంపేటలో డైరెక్టర్ నర్సింలు, నాయకులు విఠల్‌తో కలిసి కేంద్రాన్ని ప్రారంభించారు.

నర్సాపూర్: ఎర్రకుంట తండాలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

హవేళీఘనపూర్ మండలం కొత్తపల్లి కొనుగోలు కేంద్రం వద్ద రైతులతో మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ నగేశ్

వెల్దుర్తి: ఏదులపల్లిలో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సొసైటీ సీఈవో సిద్ధయ్య

చిన్నశంకరంపేట: కొర్విపల్లి కొనుగోలు కేంద్రంలో ధాన్యాన్ని పరిశీలిస్తున్న సివిల్ సప్లై డీఎం హరికృష్ణ

రామాయంపేటలో కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంచార్జి ఏడీఏ.రాజ్‌నారాయణ

ఇండ్ల జాబితా తయారు చేయాలి

- ప్రతి ఇంటికీ స్టిక్కర్లు అంటించాలి
- 1784 మంది ఎన్యూమరేట్లను నియమించాం
- 15 రోజుల్లో సర్వే పూర్తి చేయాలి
- టెలీ కాన్ఫరెన్స్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): సామాజిక, ఆర్థిక, విద్య, ఉపాధి, రాజకీయ, కుల సమగ్ర ఇంటింటి కుటుంబ సర్వే నిర్వహణకు 6, 7, 8 తేదీల్లో ఇండ్ల జాబితా (హౌస్ లిస్టింగ్) తయారు చేయాలని కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. బుధవారం నుంచి హౌస్ లిస్టింగ్ ప్రారంభం కానున్న నేపథ్యం లో మంగళవారం మండల ప్రత్యేక అధికారులు, తహసీల్దార్లు, ఎంపీడీవోలు, ఎంపీవోలు, సూపర్ వైజర్లతో టెలీ కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రెండు రోజుల్లో ఇంటింటి జాబితా గణనలో ప్రతి ఇంటికీ స్టిక్కర్ అంటించాలన్నారు. సర్వే పూర్తయిన తదుపరి మార్కర్ పెన్‌తో తేదీ వేయాలని సూచించారు. 8వ తేదీ నుంచి సమగ్ర కుటుంబ సర్వే ప్రారంభం కావాలని తెలిపారు. ఈ ప్రక్రియ 15 రోజుల్లో పూర్తి చేసేందుకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. జిల్లాలో 21 మండలాలు, 2లక్షల 13,950 ఇండ్లు సర్వే నిర్వహణకు 1571 ఎన్యూమరేషన్ బ్లాకులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. సర్వే నిర్వహణకు గ్రామీణ ప్రాంతాల్లో 1468 మంది, పట్టణ ప్రాంతంలో 256 మందితో కలిపి మొత్తం 1724 మంది ఎన్యూమరేటర్లను నియమించామని తెలిపారు. పర్యవేక్షణకు గ్రామీణ ప్రాంతాలకు 160 మంది, పట్టణ ప్రాంతానికి 26 మంది మొత్తం 186 మందిని నియమించినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లగా పీఎస్ ఉపాధ్యాయులు, గ్రామ పంచాయతీ కార్యదర్శులు, వీవోఎస్‌లను నియమించామన్నారు. సర్వే పూర్తయిన ప్రతి ఇంటికీ అంటించిన స్టిక్కర్ చెరిగిపోకుండా మార్కర్ పెన్‌తో తేదీలు వేయాలని సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన సమగ్ర ఇంటింటి సర్వే నిర్వహణకు జిల్లాలో ఇండ్లను గుర్తించి సన్నద్ధంగా ఉండాలని పేర్కొన్నారు. 6 నుంచి ఎన్యూమరేటర్లు క్షేత్ర స్థాయికి వెళ్లి ఇంటింటి జాబితా సర్వే చేయనున్నట్లు తెలిపారు. గణనకు 150 ఇండ్లను ఒక ఎన్యూమరేషన్ బ్లాక్‌గా తీసుకుంటున్నామని స్పష్టం చేశారు. ఒక్కొక్కరు రోజుకు కనీసం పది ఇండ్ల చొప్పున పదిహేను రోజుల్లో 150 ఇండ్ల సర్వే పూర్తి చేయాలనే లక్ష్యంగా నిర్దేశించినట్లు తెలిపారు. ఎన్యూమరేటర్లకు స్టేషనరీతో కూడిన కిట్ ఇస్తున్నామన్నారు.

రామాయంపేటలో..

రామాయంపేట, నవంబర్ 5: సమగ్ర సర్వే కులగణనపై ఇంటింటికీ వెళ్లి స్టిక్కర్లను అతికిస్తున్నట్లు ఎన్యూమనేటర్ మంగమ్మ తెలిపారు. రామాయంపేట పురపాలికలోని నాలుగో వార్డులో డోర్ టు డోర్‌కు వెళ్లి సమాచారం తెలుసుకున్నారు. కుటుంబాల వారు తమకు ఇంటి వివరాలను వివరంగా చెప్పాలన్నారు. కార్యక్రమంలో కాలేరు ప్రసాద్, సైదయ్య తదితరులు ఉన్నారు.

రామాయంపేటలో ఇంటింటికీ వెళ్లి కులగణన చేపట్టి స్టిక్కర్‌ను అతికిస్తున్న ఎన్యూమరేటర్, సిబ్బంది

కలెక్టరేట్‌లో టెలీ కాన్ఫరెన్స్‌లో మాట్లాడుతున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

జర్నలిస్టు కుటుంబాన్ని పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

రామాయంపేట, నవంబర్ 5: అనారోగ్యంతో మృతిచెందిన జర్నలిస్టు కుటుంబాన్ని మాజీ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఒక దినపత్రిక రిపోర్టర్ రాగి లింగం మాతృమూర్తి రాగి లక్ష్మి(65) రాయిలాపూర్ గ్రామంలో మృతి చెందింది. విషయం తెలుసుకున్న పద్మాదేవేందర్‌రెడ్డి గ్రామానికి వెళ్లి బాధిత కుటుంబాన్ని పరామర్శించి, ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో రామాయంపేట పీఏసీఎస్ చైర్మన్ బాదె చంద్రం, సత్యంరెడ్డి, జిల్లా జర్నలిస్టు సంఘం అధ్యక్షుడు శంకర్‌దయాల్‌చారి, కంది శ్రీనివాస్‌రెడ్డి, శ్రీనివాస్‌శర్మ, ఉమామహేశ్వర్, మల్లేశం, మాజీ సర్పంచ్ నర్సాగౌడ్, సత్యనారాయణ తదితరులు ఉన్నారు.

ఎరువులను పీవోఎస్ మేషిన్‌తోనే విక్రయించాలి

నర్సాపూర్, నవంబర్ 5: ఎరువులను పీవోఎస్ మేషిన్‌తోనే విక్రయించాలని ఇన్‌చార్జి సహాయ వ్యవసాయ సంచాలకురాలు పుణ్యవతి సూచించారు. మంగళవారం మండలంలోని విత్తన, ఎరువుల, పురుగు మందుల దుకాణాలు, ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘాన్ని మండల వ్యవసాయాధికారి దీపికతో కలిసి సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ దుకాణాల యజమానులు కచ్చితంగా లైసెన్స్ కలిగి ఉండాలన్నారు. డీలర్లు వ్యవసాయ శాఖ వారికి రిపోర్టులు అందజేయాలని, స్టాక్ రిజిస్టర్లు రోజు వారి అప్‌డేట్ చేయాలని ఆదేశించారు. విక్రయాల్లో డీలర్లు నిబంధనలు ఉల్లంఘిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ధాన్యాన్ని రోడ్లపై ఆరబెడితే చర్యలు

రేగోడ్, నవంబర్ 5: రైతులు వరి కోత చేసిన తరువాత ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్ట కూడదని తహసీల్దార్ నరేశ్ అన్నారు. రోడ్లపై ధాన్యం ఆరబెడితే ప్రమాదాలు జరిగే అవకాశాలు ఉన్నాయన్నారు. ఎవరైనా ధాన్యాన్ని రోడ్లపై ఆరబెట్టి ప్రమాదాలు బాధ్యులైతే వారిపై చర్యలు తప్పవన్నారు.

మహిళ అదృశ్యం

లక్ష్మి (ఫైల్)

మెదక్ మున్సిపాలిటీ, నవంబర్ 5: మహిళ అదృష్యమైన ఘటన జిల్లా కేంద్రం మెదక్‌లో చోటు చేసుకున్నది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని కోలిగడ్డ వీధికి చెందిన మ్యాకల లక్ష్మి (56) ఈనెల 2న ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయింది. రాత్రి వరకు ఇంటికి రాకపోవడంతో బంధువులు, తెలిసిన వాళ్ల ఇండ్లలో వెతికినా ఆచూకీ లభించలేదు. దీంతో భర్త సిద్ధయ్య పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

టీపీటీఎఫ్ మండల అధ్యక్షుడిగా బాల్‌రాజ్

బాల్‌రాజ్

పాపన్నపేట, నవంబర్ 5: పాపన్నపేట టీపీటీఎఫ్ మండల శాఖ అధ్యక్షుడిగా బాల్‌రాజ్ , ప్రధాన కార్యదర్శిగా రమేశ్ ఎన్నికయ్యారు. ఉపాధ్యక్షులుగా గన్ను, కిషన్, అనిల్‌కుమార్, లక్ష్మి, షహీన్ బేగం, కార్యదర్శులుగా కవిత, ముజీబ్, విశ్వనాథ్ ఎన్నికయ్యారు.

అదనపు కలెక్టర్‌ను కలిసిన టీఎన్జీవో బృందం

అదనపు కలెక్టర్‌తో టీఎన్జీవో బృందం

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ) : అదనపు కలెక్టర్ మెంచు నగేశ్‌ను టీఎన్జీవో జిల్లా అధ్యక్షుడు దొంత నరేందర్ ఆధ్వర్యంలో ఉద్యోగులు మంగళవారం మర్యాదపూర్వకంగా కలిశారు. జిల్లా కార్యదర్శి మినికి రాజ్‌కుమార్, సహ అధ్యక్షుడు ఎండీ ఇక్బాల్ పాషా, కోశాధికారి చంద్రశేఖర్, ఉపాధ్యక్షుడు ఫజులుద్దీన్, ప్రచార కార్యదర్శి నర్సింలు, మెదక్ యూనిట్ అధ్యక్షుడు ఆరేళ్ల రామాగౌడ్, పంచాయతీ కార్యదర్శుల ఫోరం జిల్లా అధ్యక్షుడు జంగం నగేశ్, సహకార శాఖ ఫోరం జిల్లా కార్యదర్శి సంగమేశ్వర్, ఉద్యోగులు కృష్ణ, సలీం ఉన్నారు.

పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలి

చిలిపిచెడ్, నవంబర్ 5: పాడి రైతులు తమ పశువులకు గాలికుంటు నివారణ టీకాలు వేయించాలని నర్సాపూర్ పశువైద్య ఏడీ జనార్దన్ అన్నారు. మంగళవారం మండలంలో శీలాంపల్లి గ్రామంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాలను సిబ్బందితో కలిసి వేశారు. మండలంలోని ప్రతి గ్రామంలో పశువులకు గాలి కుంటు నివారణ టీకాలు తప్పనిసరిగా వేయించాలని రైతులకు తెలిపారు. టీకాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నదన్నారు. కార్యక్రమంలో మండల పశువైద్య అధికారి వినోద్‌కుమార్,చిట్కుల్ పశువైద్య వెటర్నరీ అసిస్టెంట్ ఇబ్రహీం, సిబ్బంది వోఎస్‌లు శంకర్,అరవింద్ పాల్గొన్నారు.

గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తాం

శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన ఎస్పీ ఉదయ్ కుమార్‌రెడ్డి

శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌లో మాట్లాడుతున్న ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి.

శివ్వంపేట, నవంబర్ 5: శాంతిభద్రతల విషయంలో మండలంలోని అన్ని గ్రామాల్లో పెట్రోలింగ్ ముమ్మరం చేస్తామని ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి తెలిపారు. మంగళవారం శివ్వంపేట పోలీస్‌స్టేషన్‌ను ఆయన ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ జిల్లాలో జరుగుతున్న వరుస దొంగతనాలపై, పాల్పడుతున్న దుండగలను పట్టుకోవడానికి సీసీఎస్, ప్రత్యేక బృందాలను రంగంలోకి దించామన్నారు. గ్రామాల్లో పెట్రోలింగ్‌ను మరింత ముమ్మరం చేస్తున్నామని ఆయన తెలిపారు. శివ్వంపేటలో జరిగిన మైనర్ బాలిక మిస్సింగ్ కేసును ఛేదించేందుకు మూడు, నాలుగు బృందాలను రంగంలోకి దించామన్నారు. కిడ్నాప్‌కు సహకరించిన నిందితులను త్వరలోనే పట్టుకుంటామన్నారు. శాంతిభద్రతల విషయంలో పోలీసులకు ప్రతిఒక్కరూ సహకరించాలని ఆయన సూచించారు. సమావేశంలో తూప్రాన్ డీఎస్పీ వెంకటరెడ్డి, సీఐ రంగకృష్ణ, తూప్రాన్ ఎస్సై శివానందం, శివ్వంపేట ఇన్‌చార్జి ఎస్సై రాజు, ఏఎస్సై శ్రీనివాస్, హెడ్ కానిస్టేబుళ్లు వెంకటస్వామి, సాయిలు, కానిస్టేబుల్ జానీ, గోపాల్, రాజు, ఆనంద్, స్పెషల్ పార్టీ సిబ్బంది గోవర్ధన్, సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఎంపీపీ కార్యాలయంలో జడ్పీసీఈవో తనిఖీ

రేగోడ్, నవంబర్ 5: మండల పరిషత్ కార్యాలయం జడ్పీ సీఈవో ఎల్లయ్య మంగళవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఎంపీడీవో కార్యాలయంలోని పలు రిజిష్టర్లను పరిశీలించారు. ఆయన వెంట డిప్యూటీ సీఈవో రంగాచారి, సూపరింటెండెంట్ రమేశ్, ఆపరేటర్ శ్రీధర్ ఉన్నారు.

కాంగ్రెస్ పార్టీ కార్యకర్తగా సిగ్గుచేటుగా ఉంది

నర్సాపూర్, నవంబర్ 5: 'నేను కాంగ్రెస్ కార్యకర్తను అయినందుకు సిగ్గు చేటుగా అనిపిస్తున్నది. రైతులకు ఇచ్చిన హామీలు నెరవేర్చకపోవడంతో ఆవేదన చెందుతున్నా. రైతులను ముంచేందుకు రాజకీయాలు చేయవద్దు. రైతులు ఒక్కొక్క మాట అంటుంటే భరించలేకపోతున్నా. నాకు 8 ఎకరాల పొలం ఉంది. ధాన్యాన్ని ఘనపూర్ సొసైటీకి తీసుకొచ్చా. ఇప్పటి వరకు ఒక్క సంచి కూడా కొనలేదు. నన్ను అందరూ తిడుతున్నారు.' అని కొల్చారం మండలం ఘనపూర్ గ్రామ పార్టీ సలహాదారుడు సిద్దిరాములు వాట్సాప్ గ్రూప్‌లో తన బాధను వెళ్లగక్కాడు.

యువతిపై హత్యాయత్నం చేసిన వ్యక్తి అరెస్ట్

సమావేశంలో నిందితుడిని ప్రవేశపెట్టిన పోలీసులు

మెదక్ అర్బన్, నవంబర్ 5: మెదక్‌లోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల వద్ద సోమవారం యువతిపై హత్యాయత్నం చేసిన యువకుడు ధనసిరి చైతన్యను పోలీసులు 24 గంటల్లో అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు మెదక్ డీఎస్పీ ప్రసన్నకుమార్ తెలిపారు. మంగళవారం పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో డీఎస్పీ మాట్లాడుతూ.. ఇన్‌స్టాగ్రామ్‌లో 2022 నుంచి దివ్యకృపతో పరిచయం చేసుకుని, ప్రేమ పేరుతో వేధించడంతో అతడిని, అమ్మాయి దూరం ఉంచిందన్నారు. ఆ కోపంతో హత్యాయత్నానికి పాల్పడినట్లు తెలిపారు. నిందితుడిని మెదక్‌లోని బస్టాండ్‌లో పట్టుకున్నట్లు తెలిపారు. నిందితుడి వద్ద సెల్‌ఫోన్, రక్తపు మరకలు అంటిన షర్టును స్వాధీనం చేసుకున్నట్లు పేర్కొన్నారు. నిందితుడు ఆంధ్రప్రదేశ్‌లోని నెల్లూరు జిల్లా ఆత్మకూర్ గ్రామం కాగా ప్రస్తుతం బెంగళూరులో నివాసం ఉంటున్నాడని తెలిపారు. పరిచయం లేనివారితో ఇన్‌స్టాగ్రామ్‌లో ఇతర సామాజిక మాధ్యమాల్లో సమాచారం పంచుకోవద్దని సూచించారు. పరిచయం లేని వ్యక్తులకు ఫొటోలు, వ్యక్తిగత సమాచారం ఇవ్వద్దన్నారు. అమ్మాయిలను ఎవరైనా ఆకతాయిలు ఫోన్లో గాని, బస్టాండ్ వద్ద, ఎక్కడైనా గాని వేధించినట్లు గుర్తిస్తే వెంటనే షీ టీం, డయల్ 100కు ఫోన్ చేసా సమాచారం అందిస్తే చర్యలు తీసుకుంటామన్నారు.

వరి దిగుబడిపై పంట కోత ప్రయోగం

ధాన్యం తూకం వేస్తున్న ఏఈవో భూపాల్, ఏఎస్‌వో వెంకటేశం

చిలిపిచెడ్, నవంబర్ 5: పంట దిగుబడి ఎంత వరకు వస్తుందో తెలుసుకోవడం కోసమే సంయుక్తంగా వరి పంటకోత ప్రయోగాలు నిర్వహిస్తున్నట్లు ఏఈవో భూపాల్, ఏఎస్‌వో వెంకటేశం తెలిపారు. మంగళవారం మండలంలోని అజ్జమర్రిలో రైతు బాల్‌రాజు పొలంలో నిర్వహించిన పంట కోత ప్రయోగాలను పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సాగు చేసిన పంటను గుంట భూమిలో ఐదు మీటర్లు పొడువు, ఐదు మీటర్లు వెడల్పు కొలతలు వేసి వరి కోసి, వచ్చిన ధాన్యాన్ని అక్కడే తూకం వేస్తామన్నారు. ఈ విధమైన పంటకోత ప్రయోగంతోనే సరైన గణాంకాలు తెలుసుకోవచ్చన్నారు. ఈ రైతు వరి పొలంలో ప్రయోగం నిర్వహించగా దిగుబడి ఎకరానికి 30 క్వింటాళ్ల ధాన్యం వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మండల ప్రణాళిక గణాంక అధికారి వెంకటేశ్, రైతులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై నిర్లక్ష్యం చేయద్దు

ఆరోగ్య సిబ్బంది గ్రామాల బాట పట్టాలి: జిల్లా వైద్యాధికారి శ్రీరాం

రామాయంపేటలో పోస్టర్ ఆవిష్కరిస్తున్న వైద్యాధికారి శ్రీరాం

రామాయంపేట, నవంబర్ 5: సీజనల్ వ్యాధులపై ఆరోగ్య సిబ్బంది శ్రద్ధ కనబర్చాలని జిల్లా వైద్యాధికారి శ్రీరాం పేర్కొన్నారు. మంగళవారం డీ.ధర్మారం పీహెచ్‌సీని సందర్శించి, గంజాయి, నార్కోటిక్ పోస్టర్ ఆవిష్కరించారు. సిబ్బందికి కేటాయించిన గ్రామాల్లోనే రోజూ ఉండాలన్నారు. డాక్టర్లు శ్రీనివాస్, హరిప్రియ, నవీన్, శంకర్ రాథోడ్, లక్ష్మణ్ ఉన్నారు.

పీహెచ్‌సీ స్థల పరిశీలన

నిజాంపేట, నవంబర్ 5: నిజాంపేటలో పీహెచ్‌సీ ఏర్పాటుకు డీఎంహెచ్‌వో స్థల పరిశీలన చేశారు. దీనికోసం రూ.2.45 కోట్లు నిధులు మంజూరయ్యాయని తెలిపారు. ఆరోగ్య ఉప కేంద్రాన్ని పరిశీలించి, త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. సాయికృష్ణ, వెంకటేశ్వర్లు, ఏఎన్‌ఎం బాలమణి, మాజీ సర్పంచ్ సత్యనారాయణ, నాయకులు మహేందర్, నసీరోద్దీన్, వెంకటేశ్‌గౌడ్, అజయ్, శ్రీకాంత్ గౌడ్, సర్వేయర్ ప్రశాంత్ ఉన్నారు.

వెంకట్ రెడ్డిపై ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ కు ఫిర్యాదు

వినతి పత్రం అందజేస్తున్న బాధితులు

శివ్వంపేట, నవంబర్ 5: దొంతి గ్రామానికి చెందిన మల్లవరం వెంకట్‌రెడ్డిపై చర్యలు తీసుకోవాలని రాష్ట్ర ఎస్సీ ఎస్టీ కమిషన్ చైర్మన్ బక్కి వెంకటేశంను హైదరాబాదులోని ఆయన కార్యాలయంలో మంగళవారం ఫిర్యాదు చేశారు. బాధితులు కోదాస్ స్వామి, పూలమ్మ మాట్లాడుతూ మల్లవరం వెంకటరెడ్డి కులం పేరుతో దూషించి కొట్టినందుకు అతనిపై ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసు నమోదు చేసినట్లు, వెంటనే అరెస్టు చేయాలని కోరినట్లు తెలిపారు. వారితో ఎమ్మార్పీఎస్ జిల్లా అధ్యక్షుడు యాదగిరి మాదిగ, మాజీ ఎంపీటీసీ లక్ష్మీకుమార్, మాజీ ఉప సర్పంచ్ సత్యనారాయణ, ఆత్మ కమిటీ మాజీ డైరెక్టర్ ముత్యాలు ఉన్నారు.

పెండింగ్ బిల్లులు, డీఏలను విడుదల చేయాలి

కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఉపాధ్యాయులు

మెదక్, నవంబర్ 5 (నమస్తే తెలంగాణ): పెండింగ్ డీఏలు, పీఆర్‌సీని ప్రకటించాలని తపస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నవాత్ సురేశ్ డిమాండ్ చేశారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. కార్యక్రమంలో జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎల్లం, లక్ష్మణ్, రాష్ట్ర బాధ్యులు భాస్కర్, రామారావు, మహిళా అధ్యక్షురాలు స్వరూపారాణి, ఉపాధ్యక్షురాలు మాధవి తదితరులు పాల్గొన్నారు.

పురుగులు పడ్డ కల్లు విక్రయం

కల్లు దుకాణం ఎదుట ఆందోళన చేస్తున్న గ్రామస్తులు

రామాయంపేట, నవంబర్ 5: పురుగుల పడ్డ కల్లు విక్రయిస్తున్న ఘటన మండలంలోని కాట్రియాల గ్రామంలో మంగళవారం జరిగింది. గ్రామంలోని ఒకటో నెంబర్ కల్లు దుకాణంలో కల్లు తాగుతున్న గ్రామస్తులకు సీసాలో జిల్ల పురుగులు కనిపించాయి. దీంతో కల్లు డిపో యజమానితో వాగ్వాదానికి దిగారు. ఈ విషయమై రామాయంపేట ఎక్సైజ్ అధికారుల దృష్టికి తీసుకెళ్తామని తెలిపారు. కల్లు డిపో యజమానితో దుకాణం ముందు ఆందోళన వ్యక్తం చేశారు.

రైతు కుటుంబానికి పరిహారం చెక్కు అందజేత

చెక్కు అందజేతున్న అధికారులు

చిలిపిచెడ్,నవంబర్ 5: మండలంలోని చిట్కుల్ గ్రామానికి చెందిన పోతారపల్లి లచ్చయ్య ఆరు నెలల క్రితం విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. విషయం తెలిసిన విద్యుత్ అధికారులు స్పందించి రైతు కుటుంబానికి రూ.5 లక్షల చెక్కు మెదక్‌లో విద్యుత్ శాఖలో డీఈ చాంద్ పాషా అందజేశారు. మాజీ ఎంపీటీసీ సుభాష్‌రెడ్డి, విఠల్‌రెడ్డి ఉన్నారు.

గుంతలను పూడ్చండి మహాప్రభో

నర్సాపూర్,నవంబర్5: నర్సాపూర్ చౌరస్తాలోని సిగ్నల్స్ వద్ద ఏర్పడిన గుంతలను పూడ్చాలని ప్రయాణికులు కోరుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. రాత్రి వేళల్లో ఈ గుంతల్లో పడి ప్రమాదాలు జరుగుతున్నాయని ప్రయాణికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు పట్టించుకుని గుంతలను పూడ్చి ప్రమాదాల బారి నుంచి కాపాడాలని కోరుకుంటున్నారు.

కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి

చిన్నశంకరంపేట, నవంబర్ 5: కుక్కల దాడిలో 12 గొర్రెలు మృతి చెందిన ఘటన మండలంలోని కుర్మపల్లిలో మంగళవారం జరిగింది. పుల్ల స్వామికి చెందిన గొర్రెల మందపై ఒక్కసారిగా కుక్కలు దాడి చేశాయి. ఈ దాడిలో 12 గొర్రెలు అక్కడికక్కడే మృతి చెందాయి. దీంతో రూ.80 వేల నష్టం జరిగిందని స్వామి తెలిపారు. ప్రభుత్వం ఆర్థిక సాయం అందించి ఆదుకోవాలని